సాక్షి
తిరుపతి

సోమవారం ׀ 17 ׀ మార్చి ׀ 2025



ఏదీ స్వచ్ఛత.. లేదు శుభ్రత!

తిరుపతి నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తాచెదారాలే దర్శనమిస్తున్నాయి. - 8లో



తిరుచ్చిపై సూర్యనారాయణుడు

తిరుచానూరులోని శ్రీ సూర్యనారాయణ స్వామివారు ఆదివారం తిరుచ్చి వాహనంపై తిరు మాడవీధుల్లో విహరించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సా)	సహర్ మంగళవారం (ఉ)
తిరుపతి	6-26	4-59
గూడూరు	6-21	4-54

న్యూస్‌రీల్

అవినీతి అంతస్తులు



నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

తిరుపతి తుడా: తిరుమల బైపాస్ రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం ఎదురుగా 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కూటమి నేతల అండతో నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలోనే ఆరు అంతస్తుల భారీ భవనం నిర్మిస్తున్నా అటువైపు ఎవ్వరూ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణంతో మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయానికి సుమారు రూ.2 కోట్ల మేర గండి పడుతోంది. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు ఆరు అంతస్తులతో టౌన్‌ప్లానింగ్ అనుమతి లేకుండా భవనం కడుతున్నా అడ్డుకునేవారు కరువయ్యారు. కొంతమంది టౌన్ ప్లానింగ్ అధికారులు కాసుల కక్కుర్తితో అక్రమ నిర్మాణానాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

20న ఎన్‌ఎస్‌యూ స్నాతకోత్సవం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని ఈనెల 20వ తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు మహతి ఆడిటోరియంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ సంస్కృత వర్సిటీగా విద్యాపీఠం రూపాంతరం చెందిన నాటి నుంచి ఇప్పటి వరకు మూడు స్నాతకోత్సవాలు నిర్వహించారు. అదే స్ఫూర్తితో నాలుగో స్నాతకోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

తిరుపతి ఎడ్యుకేషన్:తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్ మూల్యాంకనం చేపట్టనున్నట్లు ఆర్ఐఓ జీవీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 17నుంచి ఇంగ్లిష్, మ్యాథ్స్, తెలుగు, సివిక్స్, తమిళ మీడియం, ఒకేషనల్ జవాబుపత్రాల వాల్యుయేషన్ ఉంటుందన్నారు. 22 నుంచి ఫిజిక్స్, బోటనీ, హిస్టరీ, తమిళ మీడియం, ఒకేషనల్ సబ్జెక్టులు, 24నుంచి కెమిస్ట్రీ, కామర్స్, ఎకనామిక్స్, 26వ తేదీ నుంచి జువాలజీ మూల్యాంకనం జరుగుతుందని వివరించారు.

42వ రోజుకు చేరిన జూడాల సమ్మె



42వ రోజు సమ్మెలో పాల్గొన్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ:గౌరవవేతనం పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీ జూడాలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 42వ రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం చేసుకోకపోవడం దారుణమన్నారు. గౌరవేతనం పెంచేవరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు.

ఆటవిక రాజ్యం



అక్రమించుకున్న భూమిలో సాగు చేస్తున్న పంటలు



పచ్చమూక ఆక్రమణలో అటవీ భూములు

- వెంకటగిరి పరిధిలో కబ్జాల పర్వం
- 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో వందల ఎకరాలు అన్యాక్రాంతం
- గత వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలో 100 ఎకరాల స్వాధీనం
- మిగిలిన భూములను దర్జాగా సాగు చేసుకుంటున్న టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : వెంకటగిరి రూరల్ మండలంలోని విలువైన అటవీ భూములు ఆక్రమణకు గురయ్యాయి. అక్కడక్కడా మిగిలిన భూములను సైతం గత కొంత కాలంగా దర్జాగా కబ్జా చేస్తున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో ఆక్రమణలు కొనసాగుతున్నా అధికారులు అడ్డుకునేందుకు సాహసించలేకపోతున్నారు. చేసేది లేక కొందరు అధికారులు సైతం టీడీపీ నాయకులతో కుమ్మక్కైపోతున్నారు. ఆక్రమిత భూముల్లో కొన్నింటిని ఆన్‌లైన్‌లో రెవెన్యూ భూములుగా మార్చుకుంటున్నారు.

అధికారమే అండగా..

ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో తమ్ముళ్ల ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారు. భారీగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. అలా ఆక్రమించుకున్న వాటిని రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వెంకటగిరి రూరల్ మండలం మన్నేగుంట, పూలరంగడుపల్లి, బసవాయిగుంట పరిధిలో సుమారు 1200 ఎకరాల అటవీ, మరో 65 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ప్రస్తుతం ఈ భూములన్నీ ఆక్రమణకు గురయ్యాయి. 2014–19 మధ్య కాలంలో ఈ వెంకటగిరి పరిధిలో వందల ఎకరాల అటవీ భూములను టీడీపీ నేతలు కబ్జా చేసేశారు. నకిలీ రికార్డులను సృష్టించి ఆక్రమించున్నారు. ప్రధానంగా 2014–19 మధ్య కాలంలో అధికారం అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా దురాక్రమణకు పాల్పడ్డారు. రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై ఆన్‌లైన్‌లోకి ఎక్కించేసుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పచ్చమూక ఆగడాలకు కొంత వరకు చెక్ పెట్టారు. మళ్లీ కూటమి సర్కారు రావడంతో ఇదే అదునుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కుదిరిన మేరకు కొన్నింటిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మరికొన్నింటిని చదును చేసి పంటల సాగు చేపట్టేశారు. ఇందుకోసం అక్రమంగా కరెంట్ లైన్‌లను ఏర్పాటు చేయించుకున్నారు. కనీసం బిల్లులు కూడా చెల్లించకుండా విద్యుత్ చౌర్యానికి సైతం తెగబడుతున్నారు.

మరోసారి రెచ్చిపోతున్న కబ్జాదారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమార్కులు రంగంలోకి దిగారు. మిగిలి ఉన్న అటవీ భూములను ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లతో చదునుచేసి సాగు చేసుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఆక్రమణలకు కొందరు అటవీ, రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



చదును చేసిన అటవీ భూమి

భూములను టీడీపీ నేతలు కొందరు ఒక్కొక్కరు 20 నుంచి 100 ఎకరాల వరకు ఆక్రమించుకున్నారు. అందులో అటవీ యాక్ట్‌ని తుంగలో తొక్కి ఉన్న చెట్లను జేసీబీలతో తొలగించి చదునుచేసి పంటల సాగు ప్రారంభించారు. అటవీ భూముల్లో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వరు. అయినా కొందరు విద్యుత్ కనెక్షన్లు తీసుకుని బోర్లు వేసుకుని పంటలు సాగు చేస్తున్నారు. మరి కొందరు బోర్లు వేసుకుని సోలార్ విద్యుత్ ద్వారా పంటలు పండించుకుంటున్నారు. ఈ ఆక్రమణలను అప్పట్లోనే సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నంబర్ 74లోని 175 ఎకరాల్లో సుమారు వంద ఎకరాల వరకు అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన భూముల్లో జోలికి వెళ్లలేదు. అప్పట్లో టీడీపీ నేతలు అడ్డుకున్నారని నాటి అటవీ అధికారులు చెప్పుకొచ్చారు.



సాగులో నిమ్మతోట

నోటీసులు ఇస్తున్నాం

వెంకటగిరి రేంజ్ పరిధిలో భారీగా అటవీ భూములు ఉన్న మాట వాస్తవమే. వాటిని కొందరు ఆక్రమించుకున్నదీ నిజమే. కబ్జాకు గురైన భూముల్లో సుమారు వంద ఎకరాల వరకు స్వాధీనం చేసుకుని ప్లాంటేషన్ చేశాం. మిగిలిన భూమిని స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ఆక్రమణ దారులకు నోటీసులు ఇస్తున్నాం. అటవీ భూముల ఆక్రమణ చట్టరీత్యానేరం. ఎప్పటికైనా స్వాధీనం చేసుకుంటాం.

– లోకేష్, ఫారెస్ట్ రేంజర్, వెంకటగిరి

పరీక్షలకు సర్వం సిద్ధం

తిరుపతి అర్బన్ : ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని వెల్లడించారు.

ఆంధ్రగీర్వాణీ విద్యాపీఠంలో ఎన్‌ఎస్‌యూ క్యాంపస్

తిరుపతి సిటీ : తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని ఆంధ్రగీర్వాణీ విద్యాపీఠంలో వర్సిటీ ఆఫ్ క్యాంపస్ ప్రారంభించనున్నట్లు జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సంస్కృత భాషకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల స్థానం కల్పించాలనే ఉద్దేశంతో వర్సిటీ ఆఫ్ క్యాంపస్ కార్యాలయాలను ప్రారంభిస్తున్నామని వివరించారు.

● ది సైకిల్‌మన్



ఎక్కడకి వెళ్లాలన్నా సైకిల్ పైనే.. ఎంతదూరమైనా దాని పైనే.. సుమారు 38 ఏళ్లుగా సైకిల్‌తోనే సహవాసం చేస్తూ.. సైకిల్‌మన్ కొండయ్యగా పేరుపొందాడు. పొట్టకూటి కోసం 25 ఏళ్ల క్రితం ఒంగోలు నుంచి తిరుపతికి చేరాడు. తండ్రి కొనిచ్చిన సైకిల్‌ను విడిచిపెట్టకుండా నిత్యం వినియోగించుకుంటున్నాడు. వివిధ రకాల ఏర్పాట్లు చేసుకుని తన ప్రియమైన వాహనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నాడు. సైక్లింగ్ కారణంగా బీపీ, షుగర్, కీళ్లనొప్పులు వంటివి సైతం దరిచేరలేదని సంతోషంగా చెబుతున్నాడు. – తిరుపతి తుడా

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేం



అమరజీవికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం మరువలేనదిగా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. అమరజీవి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆదివారం బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జ్యోత్స్న నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగ మూర్తి అని, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడని కొనియాడారు. ఆయన 1901 మార్చి 16న జన్మించి 1952 డిసెంబరు 15న అమరులయ్యారన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి, అమరజీవియై మహాపురుషుడిగా నిలిచారన్నారు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953, అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించగా 1956 నవంబరు 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో ఆంధ్ర రాష్ట్రం కాస్తా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడిందని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి దేవేంద్ర రెడ్డి తోపాటు పలువురు హాజరయ్యారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 82,580 మంది స్వామివారిని దర్శించుకోగా 31,905 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.0 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

● హే భగవాన్



తిరుచానూరులోని శ్రీసూర్యనారాయణస్వామి సేవలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. ప్రధానంగా ఆదివారం రోజున అభిషేకానంతర దర్శనానికి బారులు తీరుతుంటారు. సకల దోషాల పరిహారార్థం స్వామివారిని అభిషేకించిన జలాలను చల్లించుకుంటారు. ఈ క్రమంలో ఉదయం 9.30 గంటలకు అభిషేకానంతర దర్శనానికి భక్తులను అనుమతించాల్సి ఉంటుంది. అయితే ఆలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా దర్శనం ఆలస్యమవుతోంది. దీంతో గంటల తరబడి ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని భక్తులు మండిపడుతున్నారు. అలాగే పలుకుబడి ఉన్నవారిని మాత్రం వెంటనే లోపలికి పంపుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – తిరుపతి రూరల్

అన్నదాత.. గుండెకోత!



బండారుపల్లెలో కోత దశకు చేరిన వరి



● ఈమె పేరు మునెమ్మ. ఏర్పేడు మండలం బండారుపల్లె. 18 గుంటల పొలంలో వేరుశనగ, మరో 16 గుంటల్లో వరి సాగు చేపట్టారు. వేరుశనగ ఒబ్బిడి దశకు చేరుకుంది. మరో 10 రోజుల్లో పంట చేతికందే పరిస్థితుల్లో విద్యుత్ కోతల కారణంగా మొక్కలు ఎండుముఖం పట్టాయి. కేవలం 7 గంటలు మాత్రమే వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేస్తుండడంతో ఆఖరి తడికి నీరు అందడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియక మునెమ్మ కొట్టుమిట్టాడుతోంది.

ఈ దుస్థితి ఒక్క మునెమ్మకు మాత్రమే కాదు. జిల్లాలోని వేలాదిమంది అన్నదాతలకు దాపురించింది. 9 గంటల విద్యుత్ సంగతి దేముడెరుగు.. వచ్చే 7 గంటలు కూడా సక్రమంగా సరఫరా కాకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. కళ్లెదుటే పంట ఎండిపోతుంటే కన్నీరు పెడుతున్నారు.

- వ్యవసాయానికి సక్రమంగా అందని విద్యుత్
- 9 గంటల సరఫరా హామీ బుట్టదాఖలు
- అంతరాయాల నడుమ 7 గంటలకే పరిమితం
- ఆఖరు తడికి అగచాట్లు పడుతున్న రైతులు
- ఎండుముఖం పడుతున్న పంటలు



ఎండుముఖం పట్టిన వేరుశనగ

"తొమ్మిది గంటలపాటు వ్యవసాయానికి విద్యుత్ అందిస్తాం.. నిరంతరాయంగా నాణ్యమైన కరెంట్ సరఫరా చేస్తాం.. అన్నదాతకు అండగా నిలుస్తాం.. అధిక దిగుబడి సాధించేందుకు చేయూతనందిస్తాం" అంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊదరగొట్టారు. రైతులను బురిడీ కొట్టించి ఓట్లు దండుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చాక నిజ స్వరూపం బయటపెట్టారు. వ్యవసాయ విద్యుత్‌ను ఏడు గంటలకు కుదించారు. పైగా ఎడాపెడా కోతలు విధిస్తూ రైతాంగానికి చుక్కలు చూపిస్తున్నారు.

రేణిగుంట/తిరుపతి అర్బన్ : జిల్లాలోని రైతులు ఎక్కువగా వ్యవసాయ బోర్లపైనే ఆధారపడి పంటల సాగు చేస్తున్నారు. ఇప్పటికే ముందస్తుగా నాటిన చోట్ల వరి కోతలు మొదలయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఆఖరి తడి అందించాల్సిన పరిస్థితి. ఈ సమయంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు బోర్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టడంతో తరచూ లైన్లు ట్రిప్ అయ్యి విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. మరమ్మతులకు ట్రాన్స్‌కో సిబ్బంది చేయి తడపాల్సిన దుస్థితి దాపురించింది. ఈ క్రమంలో పంటలను కాపాడుకునేందుకు రైతులు సతమతమవుతున్నారు.

జిల్లా సమాచారం

మొత్తం రైతులు	1,56,450
సాగులో ఉన్న పంటలు (ఎకరాల్లో)	
వరి	2,00,100
వేరుశనగ	3,456
మినుము	1,234
సజ్జ	1,044
చెరుకు	560
నువ్వులు	80
మొక్కజొన్న	32
ఇతర పంటలు	180

దగా చేస్తోంది



కూటమి ప్రభుత్వం దగా చేస్తోంది. రైతులకు 9గంటలు నాణ్యమైన విద్యుత్‌ను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. అయితే ఇప్పుడు ఏడు గంటలకు తగ్గించేశారు. దీంతో ఆఖరి తడులకు సాగునీరు అందక పంటలు ఎండబెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా నాణ్యమైన విద్యుత్ అందించాలి.

– శంకర్‌రెడ్డి, రైతు సంఘం నేత, రేణిగుంట

సక్రమంగా ఇవ్వడం లేదు



వ్యవసాయానికి విద్యుత్‌ను ఏడు గంటలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. అనేకసార్లు లైన్లు ట్రిప్ అవుతూ కరెంటు పోతోంది. మళ్లీ సిబ్బంది వచ్చి రిపేర్లు చేసే వరకు ఎదురు చూడాలి. నేను రెండెకరాల్లో వేసిన వేరుశనగ పంటకు సాగునీరు చాలడం లేదు. గతంలోనూ చంద్రబాబు కక్ష గట్టి మరీ రైతులపైనే కేసులు పెట్టించారు. కోతలు లేకుండా ఏడు గంటలైనా నిరంతరాయంగా వ్యవసాయ విద్యుత్ అందించాలి.

– మంగారెడ్డి, కె.వెంకటాపురం, శ్రీకాళహస్తి మండలం

నేటి నుంచి 'పది' పరీక్షలు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 164 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. మొత్తం 28,656 మంది పరీక్ష రాయనున్నట్లు అధికారుల వెల్లడించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే పరిష్కారం కోసం 7569787131 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. పిల్లలు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

ఉచిత ప్రయాణం

పదోతరగతి విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే హాల్ టికెట్ చూపించి విద్యార్థులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

గుంతలెప్పుడు పూడ్చుతారో?


రోడ్డుపై గోతిలో ఇరుక్కుపోయిన కారు

పెళ్లకూరు: కొణతనేరి–కోనేటిరాజుపాళెం ఆర్‌అండ్‌బీ రహదారి మార్గం, ముమ్మాడిగుంట గ్రామ సమీపాన రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడాయి. ఆదివారం ఓ కారు గుంతలో పడి ఇరుక్కుపోయింది. గత కొన్ని రోజులుగా ఈ గుంతల వల్ల స్కూల్ బస్సులు, ఆర్టీసీ సర్వీసులు కూడా నడవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

చంద్రగిరి: మండలంలోని తొండవాడ వద్ద ఈ నెల 9న బైక్ ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీ గాంధీపురానికి చెందిన నారాయణ(45) 9న బైక్‌లో చంద్రగిరి నుంచి తిరుపతి వెళుతున్నాడు. తొండవాడ వద్ద మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నారాయణను స్థానికులు 108లో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీ


ధ్వంసమైన కార్లు

చంద్రగిరి : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై కాశిపెంట్ల వద్ద ఆదివారం సాయంత్రం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. తిరుపతికి చెందిన భువనదిత్య, వరప్రసాద్, సాయికుమార్ వ్యక్తిగత పనులపై కారులో చిత్తూరు వైపునకు బయలుదేరారు. ఈ క్రమంలో కడప నుంచి కుప్పానికి వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో కడప నుంచి వస్తున్న కారులోని శ్రీనివాసన్, మంజునాథ, గీత, భాగ్యలక్ష్మి, సువార్త, అరవింద్ కుమార్‌తో పాటు తిరుపతికి చెందిన ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను చంద్రగిరి ఏరియా ఆస్పత్రి, తిరుపతి రుయాకు తరలించారు.

ఏదీ స్వచ్ఛత.. లేదు శుభ్రత!

ఆధ్యాత్మిక నగరంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైంది. స్వచ్ఛత సవాల్‌గా మారిపోయింది. మాస్టర్‌ప్లాన్ రోడ్ల పక్కన చెత్తాచెదారాలు నిండిపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది. డ్రైనేజీల్లో ఎక్కడికక్కడ మురుగు నిల్వ చేరింది. తిరుపతికి తరలివస్తున్న యాత్రికులకు ముందుగా దుర్వాసన స్వాగతం పలుకుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందం తిరునగరి పర్యటనకు రానుంది. స్మార్ట్ సిటీ పరిశుభ్రతకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టకుంటే ప్రతిష్టాత్మక స్వచ్ఛ సర్వేక్షణ్–2025 ర్యాంకింగ్‌పై ప్రభావం పడే ప్రమాదముంది.


మాస్టర్‌ప్లాన్ రోడ్డు పక్కన ఇదీ పరిస్థితి

తిరుపతి నగరంలోని మొత్తం ఇళ్లు	1.10 లక్షలు
జనాభా	4.5 లక్షలు
నిత్యం వచ్చే యాత్రికులు	సుమారు లక్ష మంది
రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త	229 టన్నులు
మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది	967
ఇందులో శాశ్వత ఉద్యోగులు	110 మంది
అవుట్ సోర్సింగ్	857 మంది

- తిరుపతిలో పర్యటించనున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం
- నగరంలో పేరుకుపోయిన టన్నుల కొద్దీ వ్యర్థాలు
- చెత్తాచెదారాలతో నిండిపోయిన కాలువలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత.. ఉన్నవారు విధులకు డుమ్మా

తిరుపతి తుడా : తిరుపతి నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసింది. కమిషనర్ స్థాయి అధికారి నిత్యం పర్యవేక్షిస్తున్నా.. ఫలితం శూన్యంగా మారింది. కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల వారీగా విభజించి పారిశుద్ధ్య పనులు చేపడుతున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది. పారిశుద్ధ్య సిబ్బందిలో సగం మందికి పైగా విధులకు డుమ్మాకొడుతుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ విషయం కనిపెట్టిన కమిషనర్ మౌర్య ప్రత్యేకంగా ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తీసుకువచ్చారు. అయితే ఈ విధానానికి సిబ్బంది మొదలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వరకు మస్కా కొడుతుండడం గమనార్హం.

పోటీకి వేళాయె!

కేంద్ర ప్రభుత్వం మెరుగైన పారిశుద్ధ్యం అమలు కోసం 2016 నుంచి స్వచ్ఛ భారత మిషన్ కింద స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్–2025 పోటీ ఆరంభమైంది. వారం పది రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రత్యేక బృందం తిరుపతికి రానుంది. అలాగే సీనియర్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకోనుంది. ఈ క్రమంలో లోపాలను అధిగమించి మెరుగైన పారిశుద్ధ్యం అమలు చేసేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గతంలో ఇలా..

గతంలో తిరుపతి కార్పొరేషన్ కమిషనర్లుగా హరికిరణ్, విజయరామరాజు, పిఎస్ గిరీష, హరిత పని చేసినప్పుడు పారిశుద్ధ్య లోపాలను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు తిరుపతి మెరుగైన ర్యాంకులు సాధించేందుకు చేశారు.

అంతా చెత్త మయం!

తిరుపతి నగర శివారు, బస్టాండ్ పరిసర ప్రాంతాలలో చెత్త కుప్పలు డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్నాయి. కొన్ని వార్డులో సగం మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం విధులకు గైర్హాజరవుతుండడంతోనే ఈ దుస్థితి దాపురించింది. నగరంలోని ప్రధాన కాలువలు, మురుగు కాలువల్లో టన్నుల కొద్దీ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. మాస్టర్ ప్లాన్ రోడ్ల పక్కన ప్రతిరోజు 30 టన్నుల వరకు వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ చేస్తున్నారు. సుందరంగా అభివృద్ధి చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు చెత్తకుప్పలతో నిండిపోయి కళా విహీనంగా మారిపోయాయి. ఇంత జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్రజా ఆరోగ్య సిబ్బంది నియంత్రించలేకపోతున్నారు. ఉపాధ్యాయ నగర్, తిమ్మనాయుడుపాలెం, చింతల చేను, కొరమీనుగుంట, ఆటో నగర్, తూర్పు ప్రాంతం మొత్తం చెత్తాచెదారాలతో నిండిపోయాయి.


అన్నమయ్య మార్గ్ కల్వర్ట్ వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు


పెద్దకాపులేఅవుట్‌లో ..


పోస్టాఫీస్–పెద్దకాపు లేఅవుట్ రోడ్డు వద్ద..


అన్నమయ్య మాస్టర్ ప్లాన్ రోడ్డులో డంప్ చేసిన చెత్తాచెదారం


అన్నమయ్య మాస్టర్ ప్లాన్ రోడ్డులో ట్రాక్టర్‌తో వ్యర్థాలను డంప్ చేస్తున్న దృశ్యం


కొర్లగుంట కాలువలో వ్యర్థాలు


తిరుమల బైపాస్‌రోడ్డులోని కాలువలో పేరుకుపోయిన చెత్త

మహిళపై కర్రలతో దాడి

- కేసు నమోదు చేయని పోలీసులు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


బాధితురాలి చేతికి గాయం

చిన్నగొట్టిగల్లు (ఎర్రావారిపాళెం): పాత కక్షలతో ఓ మహిళను నడి రోడ్డుపై పట్టపగలు ఈడ్చుకుని వెళ్లి కర్రలతో కొట్టినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయని ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. చంద్రగిరి నియోజకవర్గం ఎర్రావారిపాళెం మండలం నెరబైలుకు చెందిన జీవిత అనే మహిళ తలకోనకు వెళ్లే మార్గంలో హోటల్ నడుపుకుంటోంది. అదే గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, అతడి కుమారుడు హరికి ఆమెతో భూవివాదముంది. ఈ క్రమంలో ఈనెల 14వ తేదీన జీవిత తన హోటల్ వద్ద ఉండగా ఈశ్వరయ్య, హరి అటు వైపుగా వచ్చి తమ గొర్రెలను వదిలేశారు. హోటల్ వద్ద ఉన్న ఓ వ్యక్తి వాటిని తరిమేందుకు యత్నించగా ఆగ్రహించారు. జీవితపై దాడికి దిగారు. బాధితురాలు వెంటనే పోలీస్‌స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేయగా వారు పట్టించుకోలేదు. ముందు ఆస్పత్రికి వెళ్లాలని పంపేశారు. ఆదివారం ఉదయం పోలీసుల వద్దకు వెళ్లినా స్పందించలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కూటమి నేతల ఒత్తిడి కారణంగా పోలీసులు కేసు నమోదుకు వెనుకాడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నారు. దీనిపై ఎస్ఐ ఎర్రిస్వామిని వివరణ కోరగా దాడిచేసిన వారు బాధితురాలికి సమీప బంధువులని, ఈ మేరకు తాము మాట్లాడతామని గ్రామపెద్దలు కోరడంతో కేసు నమోదుకు సమయం ఇచ్చినట్లు వెల్లడించారు. ఇందులో వేరే ఉద్దేశం లేదని తెలిపారు.

కారు బోల్తా : వృద్ధురాలి మృతి

చిల్లకూరు : చెన్నై– కోల్‌కత్తా జాతీయ రహదారిపై రైటార్‌సత్రం వద్ద ఆదివారం వేకువజామున ఓ కారు బోల్తా పడడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు.. గూడూరు పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన జాలా పెంచలమ్మ(76) శ్రీకాళహస్తిలో ఉన్న తన కుమార్తె సునీత దగ్గరకు రెండు రోజుల క్రితం వెళ్లింది. కారులో కుమార్తె సునీత, మనుమరాళ్లు లహరి, పెన్నిధితో తిరుగు ప్రయాణం కాగా మార్గం మధ్యలో అదుపు తప్పి కల్వర్టు ఢీకొని బోల్తా పడింది. దీంతో పెంచలమ్మ అక్కడికక్కడే మరణించింది. మిగిలినవారు గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి అన్నమయ్య సంకీర్తనోత్సవాలు


మాట్లాడుతున్న ట్రస్ట్ అధ్యక్షుడు మోహన్‌సుందరం

తిరుపతి కల్చరల్: శ్రీత్యాగరాజ స్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు ఐదు రోజుల పాటు త్యాగరాజ మండపంలో అన్నమయ్య సంకీర్తనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ సుందరం, కంచి రఘురాం తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 80 ఏళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఉత్సవాలను చేపడుతూ ప్రతిభావంతులైన ప్రముఖ విద్వాంసులచే త్యాగరాజ సంగీతోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తిరుమల శ్రీవారి పరమభక్తుడైన అన్నమయ్యకు క్రోధి నామ సంవత్సరం స్వామివారు సాక్షాత్కరించి ఆశీస్సులు అందించారన్నారు. ఆ పవిత్రమైన ఏడాదిని పురస్కరించుకుని ఐదు రోజుల పాటు అంటే ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 9.30 గంటల వరకు ప్రముఖ విద్వాంసులచే అన్నమయ్య సంకీర్తన కచేరీలు ఉంటాయని తెలిపారు.

గ్రేడ్–3 ఏఎన్‌ఎం ఉద్యోగోన్నతుల్లో గోల్‌మాల్ ?

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉమ్మడి జిల్లాలో గ్రేడ్–3 ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతుల్లో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల పాటు జీఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎన్‌ఎంలు ప్రమోషన్‌కు అర్హులు. ఇందులో ఉద్యోగోన్నతుల కోసం కొందరు అడ్డదారులు తొక్కినట్లు విమర్శలు వస్తున్నాయి. కుల ధ్రువీకరణ పత్రం తప్పుగా ఇచ్చినట్లు తెలిసింది. సిఫార్సులు, కాసులకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శలు వస్తున్నాయి. రోస్టర్ పాయింట్లు మొత్తం గోల్ మాల్ జరిగిందని కొంత మంది ఏఎన్‌ఎంలు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నారు.

తూతూమంత్రంగా 'గ్రీవెన్స్'


కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు(ఫైల్)

- వినతులు సరే.. పరిష్కారమేదీ?
- పట్టించుకోని అధికారులు

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో అధికారులు పెద్దసంఖ్యలో జనం నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. అయితే వాటి పరిష్కారంలో మాత్రం శీతకన్ను వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు వారాలు మినహా ఇప్పటి వరకు మొత్తం 34 వారాలు గ్రీవెన్స్ నిర్వహించారు. అందులో దాదాపు 8వేలకు పైగా అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ సమస్యలపైనే 6వేల వరకు వినతులు ఉన్నాయి. మిగిలిన 2వేల అర్జీల్లో ఇప్పటి వరకు 50శాతం కూడా పరిష్కరించక పోవడం గమనార్హం. సచివాయాల్లో సిబ్బంది సర్వేల్లో తలమునకలు కావడం, మండ కార్యాలయాల అధికారులు గ్రీవెన్స్‌ను పట్టించుకోక పోవడంతో చిన్నాచితక సమస్యలపై కూడా ప్రజలు కలెక్టరేట్‌కు రావాల్సి వస్తోంది. వీధి లైట్లు, దారి, తాగునీటి సమస్యలకు కూడా కలెక్టరేట్‌లో అర్జీ పెట్టుకోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

ఒక్కోసారి.. ఒక్కోలా..

కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో అధికారులు ఒక్కోవారం ఒక్కో విధంగా నిబంధనలు అమలు చేస్తున్నారు. ఒక వారం క్యూ విధానం పాటిస్తారు. మరోసారి అర్జీదారులను గుంపులు గుంపులుగా వదిలేస్తున్నారు. ఈ క్రమంలోనే వినతులు రాసేందుకు సైతం ఏర్పాట్లు చేయడంలేదు. ప్రజలు కుర్చునేందుకు సైతం అవకాశం కల్పించడం లేదు. ఈ క్రమంలోనే మరుగుదొడ్ల పరిశుభ్రతను గాలికి వదిలేస్తున్నారు. దీంతో కలెక్టరేట్‌లోని పలు విభాగాల వద్ద దుర్వాసనే ప్రజలకు స్వాగతం పలుకుతోంది.

అందరూ రారు..!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు. కలెక్టరేట్‌లోని మొత్తం 80 విభాగాలకు చెందిన జిల్లా అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపట్టేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. 50 విభాగాల అధికారులు హాజరైతే గొప్పగా మారిపోయింది. మిగిలిన విభాగాల వారు తమ సిబ్బందిని పంపించి చేతులుదులిపేసుకుంటున్నారు. గ్రీవెన్స్‌లో కలెక్టరే ఉంటే ఓ విధంగా, జేసీ ఉంటే ఇంకోలా.. డీఆర్‌ఓ హాజరైతే మరోలా అధికారులు వ్యవహరిస్తుండడం గమనార్హం.

వృక్ష సంపదపై అధ్యయనం


అధ్యయన యాత్రలో విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు మూడు రోజుల పశ్చిమ కనుమల వృక్ష సంపద, జీవ వైవిధ్యం అధ్యయన యాత్రకు శ్రీకారం చుట్టారు. అధ్యాపకులు నాగలక్ష్మి, దేవమ్మ, కామాక్షమ్మ, వేణు, అంకన్న పర్యవేక్షణలో, విద్యార్థులు రూపేష్, శివాని నేతృత్వంలో యాత్ర చేపట్టారు. ప్రధానంగా కేరళలోని హొగెనెకల్ జలపాతం, టీ ఫ్యాక్టరీ, బ్రెడ్ గార్డెన్, రోజ్ గార్డెన్, నేషనల్ బొటానికల్ గార్డెన్, ఊటీ కొండలు, అతిరేపల్లి వాటర్‌ఫాల్స్ వంటి ప్రదేశాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లోని వృక్షసంపదను అధ్యయనం చేశారు. అధ్యాపకులు మాట్లాడుతూ వైవిధ్యమైన మొక్క భాగాలను విద్యార్థులు సేకరించారని, వాటిని హెర్బేరియం షీట్ల ద్వారా నిల్వ చేయనున్నట్లు వెల్లడించారు. సోమవారం యాత్ర ముగించుకుని వర్సిటీకి చేరుకోనున్నట్లు తెలిపారు.

తిరుచ్చిపై సూర్యనారాయణుడు

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన శ్రీసూర్యనారాయణస్వామివారు ఆదివారం బంగారు తిరుచ్చిపై విహరించారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. సాయంత్రం సూర్య నారాయణ స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువు దీర్చారు. అనంతరం తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు సుభాస్కర్ నాయుడు, చలపతి, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

జీజేఎల్‌ఏ జిల్లా అధ్యక్షుడిగా రవి


ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రవిని అభినందిస్తున్న లెక్చరర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం(జీజేఎల్‌ఏ) తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా వి.రవి (చంద్రగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల) ఎన్నికయ్యారు. తిరుపతిలో ఆదివారం జీజేఎల్‌ఏ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా పి.రాజనాల, కార్యదర్శిగా సి.వంశీకృష్ణ (చంద్రగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల), సంయుక్త కార్యదర్శిగా టీఆర్.చక్రాధర్ (పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల), కోశాధికారిగా బి.అనిల్‌కుమార్ (సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల), లేడీ సెక్రటరీగా డాక్టర్ పి.అమ్ముదేవి (పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల), రాష్ట్ర కౌన్సిలర్లుగా డాక్టర్ కె.రవీంద్రబాబు (వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల), వీఎస్ రవి (వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల) ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు జీసీజీటీఏ జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

